DD9 వార్త
తెలుగు దినపత్రిక
సోమవారం 04-05-2026

## వెంకటాపురం మండలంలో
# మంత్రి, ఎమ్మెల్యే పర్యటన..

- ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు..
- వివాహంలో పాల్గొన్న మంత్రి సీతక్క..



6

# మేఘాల ముప్పుతో రైతన్న పరుగులు...

## ధాన్యం కాపాడుకోవడమే దినచర్య

పంట పండించి ధాన్యాన్ని ఇంటి ముంగిటికి తెచ్చుకున్న రైతన్నకు ఇప్పుడు వరుణుడి భయం వెంటాడుతోంది. ఉదయం ఎండ కనిపించగానే ధాన్యాన్ని ఆరబోసి, సాయంత్రానికి మేఘాలు కమ్ముకుంటే ఉరుములు, మెరుపులు వస్తాయేమోనని గుండెల్లో గుబులు మొదలవుతోంది. ప్రతిరోజూ ఇదే ఆందోళనతో రైతులు ధాన్యపు రాశుల వద్ద కాపలా కాస్తున్నారు.

- ఉదయం ధాన్యం ఆరబోసి... సాయంత్రం రాశులు కాపాడే ఆందోళన
- ఉరుములు, ఈదురుగాలులతో యాసంగి రైతులకు కంటిమీద కునుకు లేదు



3

గోవిందరావుపేట, మే 4 ( డి డి 9 వార్త )

## ప్రైవేటు టీచర్ల బాధలు పట్టించుకోరా..



- పిల్లలను స్కూళ్ళలో చేర్పించాలని యాజమాన్యాల ఒత్తిడి..
- ప్రైవేట్ టీచర్ల మెడపై అడ్మిషన్ ల కత్తి..

6

## వానాకాలం 2026 సాగు ప్రణాళికపై
# రైతులకు కీలక సూచనలు



6

- 8 వరి రకాల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటన
- మార్కెట్‌లో అదనపు బోనస్ పొందే అవకాశం ఉంటుంది
- మండల వ్యవసాయ అధికారి :జితేందర్ రెడ్డి

# ధాన్యం కటింగ్‌పై సీపీఎం ఆగ్రహం

- **రైస్ మిల్లర్లు వెంటనే అక్రమ (తరుగు) కటింగులు నిలిపివేయాలి:**
- **సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు: సూడి కృష్ణారెడ్డి**



**గోవిందరావుపేట, మే3 (డి డి 9 వార్త)**

ఆదివారం పసర గ్రామం లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద రైస్ మిల్లర్లు క్వింటాల్‌కు మూడు నుంచి ఐదు కిలోల వరకు అక్రమంగా కట్ చేస్తూ రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నారని ఆరోపించారు. ఈ కటింగుల వల్ల ఎకరాకు నాలుగు నుంచి ఐదు వేల రూపాయల వరకు నష్టం వాటిల్లుతోందని తెలిపారు.

రబీ సీజన్‌లో పండిన ధాన్యం బాయిల్డ్ రైస్‌గా మారుతుందని, రాష్ట్రం నుంచి 30 లక్షల టన్నుల బాయిల్డ్ రైస్ సేకరణకు కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడం రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసి, రైస్ మిల్లర్ల అక్రమ కటింగులను తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు.

ధాన్యం కటింగ్ పేరుతో జరుగుతున్న దోపిడీని వెంటనే నిలిపివేయకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల సమస్యల పరిష్కారంలో సీపీఎం పార్టీ ఎప్పటికప్పుడు అండగా నిలిచి, వారి హక్కుల కోసం అలుపెరగని పోరాటం కొనసాగిస్తోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శి బి.రెడ్డి సాంబశివ, తుమ్మల వెంకట్ రెడ్డి, పొదిళ్ల చిట్టిబాబు, తీగల ఆది రెడ్డి, ఖ్యాతం సూర్యనారాయణ, అంబాల మురళి, గొర్ల శ్రీను, మద్ది నారాయణరెడ్డి, ఈరెల్లి జాన్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



## పిడుగుపాటుకు గురైన బాధిత కుటుంబాన్ని పరామర్శించిన స్థానిక ఎమ్మెల్యే వెంకట్రావు

- **పదివేల రూపాయలు తక్షణ ఆర్థిక సాయం**

**మే 3 డిడి 9 వార్త దుమ్ముగూడెం**

దుమ్ముగూడెం మండలం ముసలిమడుగు గ్రామంలో శనివారం పిడుగుపాటుకు గురైన పూజారి రమేష్ లలిత కుటుంబాన్ని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు పరామర్శించారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా 10000 రూపాయలు నగదుతో పాటు నిత్యవసర వస్తువులు అందించారు. దీంతోపాటు రెండో విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు





# వడ్డేపల్లిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

**జనగామ మే 3(డిడి 9వార్త )బ్యూరో**

వడ్డేపల్లి 60వ డివిజన్‌లో రూ.1.40 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ పట్టణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా తల్లిశిశు సంరక్షణ, టీకాలు, నిర్ధారణ పరీక్షలు వంటి సేవలు ఒకేచోట అందుబాటులోకి రావడంతో ప్రజలకు దూర ప్రయాణాలు తగ్గుతాయని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి వార్డులో వైద్య సదుపాయాలను మెరుగుపరుస్తోందని ఆమె అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు ఈ కేంద్ర సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, డీఎంహెచ్ఓ డా. అల్లెం అప్పయ్యతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్యసిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సింగరేణి సులబ్ వర్కర్స్‌కు 30 నెలల పెండింగ్ డిఏ తక్షణం చెల్లించాలి

- **డైరెక్టర్ ఆపరేషన్స్‌కు మెమోరండం సమర్పణ – ఈఎస్ఐ, ఈపీఎఫ్, బోనస్ అమలుపై ఆగ్రహం**



**పెద్దపల్లి బ్యూరో, మే 03 (డిడి9 వార్త):**

సింగరేణి పరిధిలో సులబ్ కాంప్లెక్స్‌లలో పని చేస్తున్న కార్మికులకు 30 నెలలుగా పెండింగ్‌లో ఉన్న డియర్‌నెస్ అలవెన్స్ డిఏ ను తక్షణమే చెల్లించాలని సింగరేణి సులబ్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు డిమాండ్ చేసింది. ఈ మేరకు డైరెక్టర్ ఆపరేషన్స్‌కు యూనియన్ ఆధ్వర్యంలో మెమోరండం సమర్పించారు.

సింగరేణి యాజమాన్యం పర్మినెంట్ కార్మికుల సౌకర్యం కోసం, అలాగే బస్తీల్లో నివసించే ప్రజల అవసరాల కోసం మరుగుదొడ్లను నిర్మించి, వాటిని సులబ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్‌కు 30 సంవత్సరాల లీజుకు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ కాంప్లెక్స్‌ల నిర్వహణకు సంబంధించిన రిపేర్, నీటి సరఫరా, విద్యుత్ వంటి ఖర్చులను సింగరేణి యాజమాన్యమే భరిస్తున్నప్పటికీ, అక్కడ పనిచేస్తున్న కార్మికులకు కనీస హక్కులు అమలు కావడం లేదని యూనియన్ ఆరోపించింది.

సింగరేణి వ్యాప్తంగా సుమారు 210 మందికి పైగా సులబ్ వర్కర్స్ పనిచేస్తున్నారు. వీరికి చట్టబద్ధంగా అందాల్సిన ఈఎస్ఐ, ఈపీఎఫ్, బోనస్ వంటి సౌకర్యాలు ఇప్పటికీ అమలు కాలేదని తెలిపారు. ముఖ్యంగా 2023 నవంబర్ నుంచి డియర్‌నెస్ అలవెన్స్ డిఏ చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచడం కార్మికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నదని పేర్కొన్నారు.

ఈ సమస్యలను పలుమార్లు సింగరేణి అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం లేకపోవడంతో, ఇకైనా వెంటనే డిఏ చెల్లించడంతో పాటు అన్ని సంక్షేమ పథకాలను అమలు చేయాలని యూనియన్ కోరింది.

సింగరేణి యాజమాన్యం సులబ్ సంస్థకు కోట్ల రూపాయలు మెయింటెనెన్స్ కోసం చెల్లిస్తున్నప్పటికీ, కష్టపడి పనిచేసే కార్మికుల సంక్షేమంపై నిర్లక్ష్యం ప్రదర్శించడం బాధాకరమని నాయకులు విమర్శించారు.

సులబ్ కాంప్లెక్స్‌లలో పనిచేస్తున్న కార్మికులకు అన్ని హక్కులు, సౌకర్యాలు అమలు చేయాలని సింగరేణి సులబ్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు స్పష్టం చేసింది.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి. బ్రహ్మానందం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. వెంకన్న, భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర నాయకుడు ఈదునూరి నరేష్ పాల్గొన్నారు.

# మేఘాల ముప్పుతో రైతన్న పరుగులు... ధాన్యం కాపాడుకోవడమే దినచర్య

- **ఉదయం ధాన్యం ఆరబోసి... సాయంత్రం రాశులు కాపాడే ఆందోళన**
- **ఉరుములు, ఈదురుగాలులతో యాసంగి రైతులకు కంటిమీద కునుకు లేదు**

**గోవిందరావుపేట, మే 4 ( డి డి 9 వార్త )**

పంట పండించి ధాన్యాన్ని ఇంటి ముంగిటికి తెచ్చుకున్న రైతన్నకు ఇప్పుడు వరుణుడి భయం వెంటాడుతోంది. ఉదయం ఎండ కనిపించగానే ధాన్యాన్ని ఆరబోసి, సాయంత్రానికి మేఘాలు కమ్ముకుంటే ఉరుములు, మెరుపులు వస్తాయేమోనని గుండెల్లో గుబులు మొదలవుతోంది. ప్రతిరోజూ ఇదే ఆందోళనతో రైతులు ధాన్యపు రాశుల వద్ద కాపలా కాస్తున్నారు.

ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మబ్బులతో నిండిపోవడంతో పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు మొదలవుతుండటంతో రైతుల్లో భయం నెలకొంది. ఎండలో ఆరబోసిన ధాన్యం తడిసిపోకుండా కాపాడేందుకు రైతులు ఆగమేఘాల మీద పరుగులు పెట్టి రాశులను పోగుచేసి పరదాలు కప్పారు. అయితే ఈదురుగాలుల ధాటికి పరదాలు ఎగిరిపోతుండటంతో మళ్లీ వాటిని సర్ది, బరువులు వేసి రక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

లక్నవరం చెరువు కింద సుమారు 6 వేల ఎకరాల్లో రైతులు రబీ వరి సాగు చేయగా, చిన్న చెరువులు, కుంటలు, బోర్ల కింద మరో 2 వేల ఎకరాల్లో పంట పండించారు. అయితే ఇప్పటికీ సగం ధాన్యం కూడా మార్కెట్‌కు చేరకపోవడంతో రైతుల్లో మరింత ఆందోళన నెలకొంది. ఈ నెలాఖరు వరకు కోతలు, ధాన్యపు రాశులు కొనసాగే అవకాశముండటంతో ప్రతిరోజూ సాయంత్రం మేఘావృత వాతావరణం రైతులకు పరీక్షగా మారుతోంది.

మండల వ్యాప్తంగా 18 గ్రామ పంచాయతీల పరిధిలో ఐకేపీ ఆధ్వర్యంలో 11 కొనుగోలు కేంద్రాలు, పీఏసీఎస్ ద్వారా మరో 10 కేంద్రాల్లో ప్రభుత్వం రబీ ధాన్యాన్ని కొనుగోలు చేస్తోంది. ఇప్పటివరకు వర్షాలు, వడగళ్ల ముప్పు లేక రైతులు కొంత ఊరట పొందినా... మరో 20 రోజులు వాన గండం లేకుండా గడిస్తేనే ఈ సీజన్‌ను సురక్షితంగా ముగించగలమని రైతన్న ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు.





# చంద్రబాబు కాలనీలో దోబీఘాట్ క్లీనింగ్ డ్రైవ్

- ప్రజల సహకారంతో శుభ్రత కార్యక్రమం విజయవంతం
- 48వ డివిజన్ కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి తిరుపతి

**పెద్దపల్లి బ్యూరో, మే 03 (డిడి9 వార్త):** రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ ఆదేశాల మేరకు, నగర మేయర్ సహకారంతో స్థానిక చంద్రబాబు కాలనీలోని దోబీఘాట్‌లో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో 48వ డివిజన్ కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి తిరుపతి పాల్గొని శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే రజక సంఘం అధ్యక్షుడు సారయ్యతో పాటు రాజేశం, శ్రీను, సమ్మయ్య తదితరులు పాల్గొని పరిసరాలను శుభ్రపరిచారు.

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. స్థానికులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ వంతు సహకారం అందించారు.





# బీసీ ప్రజా సంఘం రామగుండం నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్‌గా కనుకుంట్ల అవినాష్ నియామకం

- గోదావరిఖనిలో నియామక పత్రం అందజేత – బీసీల హక్కుల కోసం కృషి చేస్తానన్న అవినాష్

**పెద్దపల్లి బ్యూరో, మే 03 (డిడి9 వార్త):** తెలంగాణ బీసీ ప్రజా సంఘం రామగుండం నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్‌గా గోదావరిఖనికి చెందిన కనుకుంట్ల అవినాష్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్, నియోజకవర్గ అధ్యక్షుడు పోలవేణి నరేష్, ఉపాధ్యక్షుడు గర్వాందుల శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

గోదావరిఖనిలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు పోలవేణి నరేష్ అవినాష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా కనుకుంట్ల అవినాష్ మాట్లాడుతూ..., బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమం, బీసీల హక్కుల సాధన కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన సంఘ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంఘానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# శ్రీ సరస్వతి శిశు మందిర్ హై స్కూల్‌లో వర్చువల్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం

- స్వశోధన్ ట్రస్ట్ సహకారంతో యోగ, సెల్ఫ్ డిఫెన్స్, టెక్నికల్ స్కిల్స్‌పై శిక్షణ

**పెద్దపల్లి బ్యూరో, మే 03 (డిడి9 వార్త):** శ్రీ సరస్వతి శిశు మందిర్ హై స్కూల్‌లో శ్రీ స్వశోధన్ ట్రస్ట్ సహకారంతో విద్యార్థినీ, విద్యార్థుల కోసం వర్చువల్ సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి పోషకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల అధ్యక్షులు బంక రామస్వామి, కార్యదర్శి సూర్యప్రకాష్ పాల్గొని క్యాంప్ ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల ఆచార్య బృందం ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తోంది. ఈ సమ్మర్ క్యాంప్‌లో యోగ, సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్, కంప్యూటర్ మరియు టెక్నికల్ స్కిల్స్, ఆర్ట్స్ అండ్ క్రియేటివిటీ వంటి విభాగాల్లో శిక్షణ అందించబడుతోంది. విద్యార్థుల శారీరక, మానసిక, సృజనాత్మక అభివృద్ధికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసే దిశగా ఈ వర్చువల్ క్యాంప్ ముఖ్య పాత్ర పోషిస్తుందని పాఠశాల యాజమాన్యం అభిప్రాయపడింది.



# ఘనంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు జన్మదిన వేడుకలు

- మండలంలో నాయకులు, కార్యకర్తల సందడి

**గోవిందరావుపేట,మే 3( డి డి 9 వార్త)** జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భూక్య జంపన్న హాజరై కాకులమర్రి లక్ష్మణ్ బాబు ప్రజాసేవా దృక్పథాన్ని కొనియాడారు. పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషి జిల్లాకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సుడి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు పిన్నింటి మధుసూదన్ రెడ్డి, నామ పూర్ణ చందర్, ఉపసర్పంచ్ బూరెటి మధు, సర్పంచ్ గాంధీ నాయక్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ శ్రేణులు నాయకత్వానికి అండగా నిలుస్తూ భవిష్యత్తులో మరింత బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగగా, నాయకులు ఐక్యతను ప్రదర్శించారు.

# మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో మండల ప్రజావాణి కార్యక్రమం..

- మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి.

**మణుగూరు. మే 3 (డి డి 9వార్త)** భద్రాద్రి జిల్లా, మణుగూరు మండల కార్యాలయంలో సోమవారం నాడు ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేష్ ఒక ప్రకటనలో తెలియచేశారు.మణుగూరు మండలం లో ఉన్నటువంటి స్థానిక సమస్యలను స్థానికంగా ఇక్కడే పరిష్కరించే విధంగా మండల ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్వో తెలిపారు. ప్రజలు తమ పిర్యాదులను నేరుగా తహసీల్దార్, ఎంపిడిఓ మరియు సంబంధిత అధికారులకు తెలియజేయవచ్చు అని ఆయన పేర్కొన్నారు. మండల స్థాయిలో పరిష్కరించగల సమస్యల కోసం దూర ప్రాంతాల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేదని,మణుగూరు మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



# రాజేంద్రనగర్ మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా'దండుగుల నాగేందర్ నియామకం

- ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

**రాజేంద్రనగర్,మే 03 డిడి 9 వార్త** రాజేంద్రనగర్ మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా దండుగుల నాగేందర్ నియమితులయ్యారు. ఆదివారం రాజేంద్రనగర్‌లో నిర్వహించిన విద్యార్థి విభాగం కార్యవర్గ సమావేశంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వాల్దాస్ చంద్రశేఖర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై,నాగేందర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.అనంతరం ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు.విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని, సామాజిక సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.యువత కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా, దేశ భవిష్యత్తును మార్చే శక్తిగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.



**సమస్యల పరిష్కారమే లక్ష్యం డి. నాగేందర్**

తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని నూతన అధ్యక్షుడు డి. నాగేందర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, విద్యార్థి విభాగాన్ని మరింత బలోపేతం చేస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నేతలు శివ ముదిరాజ్,శ్రీను ముదిరాజ్,చైతన్య యాదవ్, మనీష్ ఠాకూర్,తదితరులు పాల్గొని నాగేందర్ ను శాలువా పూలమాలలతో శుభాకాంక్షలు తెలిపారు.

# మట్టిలో మాణిక్యం చుక్క సత్తయ్యకు ఘన నివాళి

- ఒగ్గు కళాకారుడు చుక్క సత్తయ్య విగ్రహ ఆవిష్కరణ
- 12 వేలకుపైగా ప్రదర్శనలు...1700 శిష్యులకు గురువు



**జనగామ, మే 3 (డిడి 9 వార్త )బ్యూరో**

జనగామ జిల్లా కేంద్రంలోని కళ్లెం కమన్ వద్ద ప్రముఖ ఒగ్గు కళాకారుడు చుక్క సత్తయ్య విగ్రహాన్ని ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మరియు ఆలేరు ఎంమ్మెల్యే బీర్ల ఐలయ్య హాజరై విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, జనగామ జిల్లా మాణిక్యపురంలో జన్మించిన చుక్క సత్తయ్య మట్టిలో మాణిక్యంలాంటి మహనీయుడని కొనియాడారు. తన కళను కులం, కుటుంబం, ప్రాంతానికి పరిమితం చేయకుండా సమాజానికి అంకితం చేసిన గొప్ప కళాకారుడని పేర్కొన్నారు. చదువు లేకపోయినా స్వయంగా విద్యను అభ్యసించి ఒగ్గు కళకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు.

చుక్క సత్తయ్య సుమారు 12 వేలకుపైగా ఒగ్గు ప్రదర్శనలు నిర్వహించి, 1700 మందికి పైగా శిష్యులను తీర్చిదిద్దిన గురువుగా నిలిచారని చెప్పారు. దేవతల కథలతో పాటు కట్నం వ్యతిరేకం, మద్యం నిషేధం వంటి సామాజిక అంశాలను తన కథల్లో ప్రస్తావిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని గుర్తుచేశారు.

జనగామ జిల్లా దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, చుక్క సత్తయ్య వంటి మహనీయులను ఇచ్చిన గర్వకారణమని ఎమ్మెల్యే అన్నారు. ఇలాంటి మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ యువతకు స్ఫూర్తినిస్తూ, వారి ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని పిలుపునిచ్చారు.ఇ కార్యక్రమంలో జనగామ మున్సిపల్ చేర్ పర్సన్ కడకంచి బాలమణి వైస్ చైర్ పర్సన్ పర్వతాలు విమలక్క సెవెల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు

# H P గ్యాస్ రిజిస్ట్రేషన్ ఓ టి పి లు లేకుండానే ఇష్టానుసారంగా గ్యాస్ పంపిణీ చేసిన వారిపై తగు చర్యలు చేపట్టాలి..

- మణుగూరు ఏరియాకు H P గ్యాస్ సరఫరా సక్రమంగా కొనసాగించడం తోపాటు పలురకాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ...
- తెలంగాణ రాష్ట్ర HPCL సేల్స్ ఆఫీసర్ పవన్ కు పిర్యాదు చేసిన టి బి జి కె ఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.



**మణుగూరు. మే 3 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు

సింగరేణి కాలరీస్ కంపెనీ కో ఆపరేటివ్ ఏజెన్సీ ద్వారా మణుగూరు సింగరేణి ఏరియా కు వచ్చిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ లలో సుమారు 500 లకు పైగా హెచ్ పి సిలెండర్ లు ఓ.టి.పి నెంబర్ లేకుండానే ఇష్టానుసారంగా పక్కదారి పట్టిన దానిపై దర్యాప్తు చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని, ఏరియా కార్మికులకు గ్యాస్ కొరత లేకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సేల్స్ ఆఫీసర్ పవన్ ను మణుగూరు ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు కోరారు. ఆదివారం నాడు చరవాని ద్వారా ఆయన ను సంప్రదించి ఫిర్యాదు చేశారు. హెచ్.పి గ్యాస్ పంపిణీ దారులు మణుగూరు సింగరేణి ఏరియా కు గత కొన్ని రోజులుగా గ్యాస్ సిలిండర్ ల సరఫరా నిలుపుదల చేయడంతో కార్మికులు వారి కుటుంబ సభ్యులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలియచేశారు. మణుగూరు సింగరేణి ఏరియా కు హెచ్ పి గ్యాస్ సరఫరా సక్రమంగా లేక కార్మిక కుటుంబాలు పడుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. గ్యాస్ సరఫరా పంపిణీ సక్రమంగా కొనసాగించాలని మణుగూరు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇటీవల కొత్తగూడెం సూపర్ బజార్ డివిజనల్ మేనేజర్ కె దేవదాస్ కు వినతి పత్రం రూపంలో అందించిన నాటి నుంచి హెచ్.పి గ్యాస్ సిలిండర్ ల సరఫరా ఏరియాలో కొంత మెరుగుపడిందని, దానిని ఆసరాగా చేసుకొని గ్యాస్ గోడౌన్ దగ్గర పనిచేసే కొంత మంది నిర్వాహకులు రాజకీయ ఒత్తిడిలకు తలొగ్గి రిజిస్ట్రేషన్ ఓ.టి.పి లు లేకుండానే ఇష్టానుసారంగా గ్యాస్ పంపిణీ చేయడం వల్ల నేడు ఏరియాకు మరల గ్యాస్ సరఫరా సంక్షోభం తలెత్తిందని అందుకు బాధ్యులపై తగు చర్యలు చేపట్టి సరఫరా సంక్షోభ సమస్యను పరిష్కరించాలని ఆయన తెలియచేశారు. గ్యాస్ బుక్ చేసుకొని ఓ.టి.పి లు పొందిన వారంత గ్యాస్ గోడౌన్ దగ్గర గ్యాస్ కోసం పడిగాపులు కాయవలసి వస్తుందని, రాత్రి షిఫ్ట్ డ్యూటీలు చేసుకొని గ్యాస్ సిలిండర్ ల లోడ్ కోసం ఎదురు చూడవలసి వస్తుందని, అక్కడ నిర్వాహకులు రోజుకో కొత్త మాట చెపుతుండడంతో ఇంట్లో గ్యాస్ లేక కార్మిక కుటుంబాలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలియచేశారు. గ్యాస్ కొరత లేని సమయంలో కార్మికుడు గ్యాస్ బుక్ చేసుకుంటే 21 రోజుల లోపు గ్యాస్ సరఫరా పంపిణీ ఉండేదని, ఇప్పుడు గ్యాస్ బుక్ చేసుకోవాలంటే 45 రోజుల వరకు ఆగాలని నిబంధన విధించారని దాని వల్ల కార్మిక కుటుంబాలు అనేక అవస్థలు ఎదుర్కోవడమే కాక సింగరేణి యాజమాన్యం ఇచ్చే సబ్సిడి కార్మికుడు నష్టపోయే ప్రమాదం ఉందని, పాత పద్ధతిలోనే గ్యాస్ బుకింగ్ సరఫరా పద్ధతి కొనసాగించాలని ఆయన తెలియచేశారు. గ్యాస్ సిలిండర్ ల కోసం గోడౌన్ దగ్గరకు రాకూడదనే నిబంధన ఇటీవల విధించారని కార్మికుల నివాసాలకు సకాలంలో గ్యాస్ సరఫరా కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పాత పద్ధతిలోనే గ్యాస్ సిలిండర్ లు గోడౌన్ దగ్గర ఇచ్చే పద్ధతి అంశంలో సింగరేణి సంబంధిత అధికారులతో మాట్లాడి కొనసాగించాలని ఆయన తెలిపారు. గ్యాస్ సరఫరా గాడిలో పడే వరకు సింగరేణి రెగ్యులర్ కార్మికుడిని ఒకరిని పూర్తి స్థాయిలో గ్యాస్ కేంద్రం దగ్గర నియమించే విదంగా సింగరేణి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం చూపాలని తెలిపారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం చేసిన విజ్ఞప్తుల పై ఆయన సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. సోమ, మంగళ వారాల్లో మణుగూరు ఏరియా లో పర్యటించి బాధ్యులను గుర్తించి వారిపై చట్ట రిత్యా చర్యలు చేపడుతామని గ్యాస్ సరఫరాలో ఉన్న అంతరాయాన్ని తొలగిస్తామని ఆయన తెలిపినట్టు నాగెల్లి తెలిపారు.

# నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**జనగామ, ఏప్రిల్ 3 (డిడి 9 వార్త ) బ్యూరో**

జనగామ నియోజకవర్గ పరిధిలోని సిద్దిపేట జిల్లా చెర్యాల పట్టణంలోని భద్రకాళీ గార్డెన్స్‌లో నిర్వహించిన ఈరు బాలమల్లు కుమారుడి వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి, సుఖసంతోషాలతో దాంపత్య జీవితం గడపాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకలో స్థానిక నాయకులు, బంధుమిత్రులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# పిడుగుపాటు గురైన బాధిత కుటుంబానికి దుమ్ముగూడెం గ్రామీణ వైద్యుల సహాయం

**మే 3 డీడీ 9 వార్త దుమ్ముగూడెం**

దుమ్ముగూడెం మండలం ముసలిమడుగు గ్రామంలో శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షం కారణంగా పూజారి రమేష్ లలిత నివాస గృహం పై పిడుగు పడి నిరాశ్రయులైన కుటుంబానికి దుమ్ముగూడెం మండల గ్రామీణ వైద్యులు సహాయం అందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రామీణ వైద్యుల సహాయక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రాజు ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం నిత్యవసర సరుకులు కొంత నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్ణశాల పంచాయతీ సర్పంచ్ వాగే ఖాదర్ బాబు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రాజు మరియు గ్రామీణ వైద్యులు ఎం భాస్కర్ రావు ఎస్ కే అజీజ్ ఎస్.కె మీరాపాస వై రమేష్ చంద్రుపట్ల రామలింగేశ్వర రావు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు..

- కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు వెల్లడి..

**మణుగూరు. మే 3 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,ఆళ్లపల్లి మండలం దొంగతోగు గ్రామ పంచాయితీకి చెందిన బీఆర్ఎస్ సర్పంచ్ బచ్చల పాపారావు మరియు నాయకులు కొమరం రమేష్ తదితరులు ఆదివారం నాడు మణుగూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామని ఎమ్మెల్యే పాయం హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పడిగ సమ్మయ్య మాజీ ఎంపీపీ, మోకాళ్ళ చంద్రశేఖర్ (రామంజగూడెం సర్పంచ్), సుతారి కృష్ణ, మర్కోడు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పేరూరు పోస్ట్‌మ్యాన్ గుండెపోటుతో మృతి

**వాజేడు, మే 3 (డీడీ9 వార్త):**

ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు గ్రామపంచాయతీ చిన్న గొల్ల గూడెం గ్రామానికి చెందిన బొల్లె నరేష్ (38) గుండెపోటుతో మృతి చెందారు. నరేష్ పేరూరు పోస్టాఫీసులో పోస్టుమ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి సుమారు తొమ్మిది గంటల సమయంలో గ్రామంలో బంధువుల వివాహాని కి వెళ్లి తిరిగి వస్తుండగా అకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో రోడ్డుపై కుప్పకూలిపోయారు. అక్కడే ఉన్న యువకులు వెంటనే స్పందించి ఆయనను స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే ఆ సమయంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, వైద్యులు పరిశీలించి అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు నరేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి ఆర్థిక ఆధారమైన ఆయన మృతితో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు అందుబాటులో ఉండి సమయానికి చికిత్స అందించి ఉంటే నరేష్ ప్రాణాలు కాపాడవచ్చని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మంత్రి సీతక్క మానవత్వం



మంత్రి సీతక్క హైదరాబాద్ నుంచి ములుగు వైపు ప్రయాణిస్తున్న సమయంలో బీబీనగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక బైక్‌ను మరో వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న దంపతులు, చిన్నారులు గాయపడ్డారు. అదే మార్గంలో వెళ్తున్న మంత్రి సీతక్క ఈ ఘటనను గమనించి క్షణం ఆలస్యం చేయకుండా వెంటనే తన కాన్వాయ్‌ను ఆపించారు. బాధితుల దగ్గరకు వెళ్లి వారి పరిస్థితిని పరిశీలించి, రోదిస్తున్న చిన్నారులను ఓదార్చి ధైర్యం చెప్పారు. తక్షణమే స్పందించిన మంత్రి, గాయపడిన వారిని తన కాన్వాయ్‌లోని వాహనంలో సమీప ఆసుపత్రికి తరలించేలా ఏర్పాట్లు చేశారు. గాయపడి ఏడుస్తున్న చిన్నారులను స్వయంగా ఎత్తుకొని వాహనంలో కూర్చోబెట్టారు. తన వ్యక్తిగత సహాయకుడిని వెంట పంపించి, వారికి అవసరమైన మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లతో మాట్లాడారు. మంత్రి సీతక్క చూపిన చొరవకు అక్కడున్న ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

## వెంకటాపురం మండలంలో మంత్రి, ఎమ్మెల్యే పర్యటన..

- **ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు..**
- **వివాహంలో పాల్గొన్న మంత్రి సీతక్క..**

**మే 03 డిడి 9 వార్త వెంకటాపురం.**

వెంకటాపురం మండలం లోఆదివారం రాష్ట్ర మంత్రి సీతక్క, భద్రాచలం నియోజక వర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పర్యటించారు. ముందుగా పార్టీ కార్యకర్తలుతో సమావేశమైన ఎమ్మెల్యే పలు సమస్యలపై చర్చించారు. తర్వాత వెంకటాపురం మండలంలో పలు పూర్తి అయిన ఇందిరమ్మ ఇళ్ళను ఆయన ప్రారంభించారు. మధ్యాహ్నం వెంకటాపురం చేరుకున్న తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ పీర్ల కృష్ణ బాబు కుటుంబానికి చెందిన వివాహానికి ఆయన స్వగృహంలో హాజరై నూతన వధు వరులను ఆశీర్వదించారు. అనంతరం వెంకటాపురం మండలం చొక్కాల గ్రామంలో జరిగిన మాజీ జడ్పిటిసి ప్రస్తుత మేడారం ట్రస్ట్ బోర్డు మెంబర్ పాయం రమణ కుటుంబంలోజరిగిన వివాహానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసానీ లక్ష్మీనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ తదితరులు పాల్గొన్నారు. వెంకటాపురం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు.



## సరెడ్డి వారి వివాహ రిసెప్షన్ కు హాజరై
## వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే రేగా...

**మణుగూరు. మే 3 (డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా, మణుగూరు పట్టణం లోని గుట్ట మల్లారం లో గల హనుమాన్ ఫంక్షన్ హాల్ నందు ఆదివారం నాడు జరిగిన సరెడ్డి రాఘవరెడ్డి రమాదేవి దంపతుల కుమారుడి వివాహ రిసెప్షన్ కు పినపాక నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మణుగూరు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, టౌన్ అధ్యక్షుడు కుంట లక్ష్మణ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వేర్పుల సురేష్, వేర్పుల శంకర్ తదితరులు పాల్గొని అక్షింతలు వేసి ఆశీర్వదించారు.



## వానాకాలం 2026 సాగు ప్రణాళికపై రైతులకు కీలక సూచనలు

- **8 వరి రకాల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటన**
- **మండల వ్యవసాయ అధికారి :జితేందర్ రెడ్డి**



**గోవిందరావుపేట, మే 3(డిడి 9 వార్త)**

వానాకాలం 2026 సీజన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకంగా ఎంపిక చేసిన 8 వరి రకాల సాగుపై ప్రత్యేక బోనస్ ప్రకటించినట్లు గోవిందరావుపేట మండల వ్యవసాయ అధికారి (ఏవో) జితేందర్ రెడ్డి తెలిపారు. రైతులు ఈ సూచించిన వరివంగడాలను సాగు చేస్తే మార్కెట్‌లో అదనపు బోనస్ పొందే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన వరి రకాలలో బీపీటీ5204 (సాంబా మసూరి), తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్15048), కేఎన్ఎం1638, జైశ్రీరామ్, హెచ్ఎమ్‌టీ (సోనా), డబ్ల్యూజీఎల్962, డబ్ల్యూజీఎల్44 (సిద్ధి), జేఎల్‌జీ1798 ఉన్నాయని ఏవో జితేందర్ రెడ్డి వివరించారు. ఈ రకాలు సుమారు 120 రోజుల నుంచి 150 రోజుల వ్యవధిలో దిగుబడికి వస్తాయని తెలిపారు. వ్యవసాయ శాఖ సూచనల మేరకు రైతులు తమ ప్రాంతాల నేల స్వభావం, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని సరైన వంగడాలను ఎంపిక చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించడం ద్వారా మెరుగైన దిగుబడితో పాటు బోనస్ ప్రయోజనం పొందవచ్చని చెప్పారు. రంగాపూర్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారి దాదాసింగ్ ధరావత్ పాల్గొన్నారు. రైతులు ధృవీకరించిన విత్తనాలను మాత్రమే వినియోగించి, శాస్త్రీయ సాగు పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని అధికారులు సూచించారు. వరి పండండి - లాభాలు పొందండి - మన భవిష్యత్తు నిర్మించండి అనే సందేశంతో రైతులను చైతన్యపరిచారు.






## ప్రైవేటు టీచర్ల బాధలు పట్టించుకోరా..

- **పిల్లలను స్కూళ్ళలో చేర్పించాలని యాజమాన్యాల ఒత్తిడి..**
- **ప్రైవేట్ టీచర్ల మెడపై అడ్మిషన్ ల కత్తి..**



**మణుగూరు.మే 3 (డి డి 9వార్త)**

అడ్మిషన్ ల పేరుతో సంబంధిత స్కూళ్ల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తుండడంతో ప్రైవేటు ఉపాధ్యాయులు సతమతమౌతున్నారు. వచ్చే ఏడాది విద్యా సంవత్సరంలో టీచరుగా కొనసాగాలంటే వేసవి సెలవుల్లో కొత్త అడ్మిషన్లు తీసుకురావాలని సంస్థలు టార్గెట్ లు పెడుతున్నాయి.అడ్మిషన్ ల కోసం తిరగని వారి విషయంలో స్కూళ్ల రీ ఓపెన్ సమయంలో విద్యా సంస్థలు తీసుకునే నిర్ణయమే శిరోధార్యం.

డిగ్రీలు,B.ed, D.ed లు చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలు రాక,గత్యంతరం లేని పరిస్థితుల్లో కుటుంబ పోషణకోసం ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్నవారు కోకొల్లలు. వినడానికి కాస్త ఇబ్బందిగా ఉన్న ప్రైవేటు టీచర్ల జీవితాలు వెట్టిచాకిరి బానిసల కంటే దౌర్భాగ్యంగా ఉన్నాయి. గత పదేళ్ల కాలంలో ప్రైవేటు విద్యా సంస్థల మీద రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టు కోల్పోయింది.వీధికొక స్కూలు వస్తున్నా వాటిలో అనుమతులు ఉన్నవి ఎన్నో తెలియని పరిస్థితి. వేలాది రూపాయలు ఫీజులు వసూలుచేసే ఈ స్కూళ్ళలో రోజంతా నిలబడి పనిచేసి, గొంతు పోయేలా పాఠాలు చెప్పే టీచర్లలో సగం మందికి కనీస వేతనం కూడా దక్కడం లేదు. వీరిలో చాలామంది ఏళ్ల తరబడి నోటిఫికేషన్లు లేక, వయసు దాటిపోయి సమీపంలోని ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తూ.. చాలీ చాలని జీతం కోసం పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నవారు కొందరైతే,ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న గౌరవంతో రాజీపడుతూ బ్రతికేవారు కొందరు.

ప్రైవేట్ స్కూళ్ళలో టీచర్లకు మార్చి ఏప్రిల్ వచ్చిందంటే నరకం గుర్తుకు వస్తుంది. స్కూలు సమయం తర్వాత వీరు విద్యార్థుల ఇండ్లకు వెళ్లి వారి తల్లితండ్రులను ఒప్పించి అడ్మిషన్లు చేయించాలి. ప్రైవేటు విద్యాసంస్థల మధ్య నెలకొన్న పోటీతో సిబ్బంది నలిగిపోతున్నారు.అడ్మిషన్ల పేరుతో వారిని తీవ్ర ఒత్తిడికి గురి చేయడం తగదని, ఎండలు తీవ్రంగా ఉన్నాయని,ఇటువంటి పరిస్థితులలో అడ్మిషన్ల కోసం తిరగడం వలన వారు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది.

మన సమాజంలో ఏ సంఘము లేకుండా ఎవరికి వారే అన్నట్టు పనిచేసే ఉద్యోగులు ఎవరైనా ఉన్నారు అంటే అది ప్రైవేటు టీచర్లే. ప్రైవేటు టీచర్లు ఎవరైనా సంఘాలు పెట్టినట్టు తెలిసినా, తమ పాఠశాలలో పనిచేసే టీచర్లు అందులో చేరినా వారి ఉద్యోగాన్ని తొలగించడం మామూలే. కాబట్టి పోరుబాట పట్టి కుటుంబాన్ని పస్తులుంచలేక.. వీరంతా ఏ సంఘము లోనూ చేరేందుకు ముందుకురాలేని దుస్థితి నెలకొంది.గడిచిన పదేళ్లలో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ప్రైవేటు టీచర్ల కష్టాన్ని దోచుకుంటున్నాయి.

కళ్ళముందు ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. MLC ఎన్నికల వేళ తప్ప రాజకీయ పార్టీలు ప్రైవేటు టీచర్ల సమస్యల్ని ప్రస్తావించకపోవడం దురదృష్టకరం. ఇకనైనా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని, ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలను కట్టడి చేయడంతో బాటు, ఇక్కడ పనిచేసే టీచర్ల సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తాయని ఆశిద్దాం.